# సీరియల్ థెరపి

-స్వర్ణ వేణుగోపాల్

ఆఫీస్ నుండి ఇంట్లోకి అడుగుపెట్టిన నాకు ఎదురుగా మా అత్తగారు కళ్లు తుడుచుకుంటూ కనిపించేసరికి ఎవరికి ఏమయిందోనన్న సందేహంతో కాళ్లు చేతులు ఆడలేదు. హ్యాండ్‌బ్యాగ్ సోఫాలో పడేసి "ఏమైంది అత్తయ్యా?" అంటూ గాబరాగా అడిగాను.

"వచ్చావమ్మా... కాఫీ పెట్టనా?" లేస్తూ అడిగారు.

ఆమె చుట్టూ కూర్చున్న మా కాలనీవాళ్లు "మేం వస్తాము" అంటూ వెళ్లిపోయారు. అందరూ మా అత్తగారి ఫ్రెండ్స్.

"కాఫీ నేను పెట్టుకుంటానుగానీ మీరెందుకు బాధపడుతున్నారో చెప్పండి ముందు" ఆమె భుజాలు పట్టి కూర్చోబెడుతూ అడిగాను.

"అది కాదు వసూ. ఆ సంపత్ ఇన్ని రోజులు భార్గవిని ప్రేమించాడా... ఇప్పుడు పెళ్లి చేసుకోనంటున్నాడే..." మళ్లీ ముక్కు చీదారు.

నాకేమీ అర్థం కాలేదు. అసలు సంపత్ ఎవరు? ఈ భార్గవి ఎవరు? పరిచయస్థుల్లో ఆ పేర్ల గలవాళ్లు ఎవ్వరైనా ఉన్నారా? అన్న సందిగ్ధంలో పడ్డ నేను చిన్ననాటి పరిచయాల దగ్గర నుండి అందరినీ ఒకసారి రివైండ్ చేసాను. ఊహూ... ఎక్కడా అలాంటి పేర్లు తగలలేదు.

సరే... ఆవిడనే అడిగేస్తే పోలా? అనుకుని "వాళ్లెవరు అత్తయ్యా?" అన్నాను.

అంతే... ఇందిరాగాంధీ ఎవరత్తయ్యా? అని అడిగినంతగా ఆశ్చర్యపోతూ.

"అయ్యో నీకు తెలీదా?" నా అజ్ఞానానికి జాలిపడ్డారు.

నేను "ఊహూ.." అంటూ అమాయకంగా తల ఊపాను. నిజంగానే నాకు తెలియదుకదా.

"ఓసీ..నీ మా టీవీ ఉందిగా?"

"మనింట్లో ఒకటే టీవీ కదత్తయ్యా ఉండేది. మీ మా అంటారేమిటి?" మొత్తానికి ఈవిడకేదో అయింది.

"అయ్యో మొద్దూ.... మీ అంటే మీదని కాదు మీ ఛానల్" అన్నారు.

అలాంటి ఛానల్ కూడా ఒకటుందా? నిజంగానే నా నాలెడ్జ్ పూర్ అనుకున్నాను.

"అందులో పక్కింటమ్మాయి సీరియల్ హీరో హీరోయిన్లే ఈ సంపత్, భార్గవీనూ" దీర్ఘం తీస్తూ, చేతులాడిస్తూ... ఇది తెలియని వాళ్లు కూడా ఉంటారా అన్న ఫీలింగిస్తూ... సణుక్కుంటూ చెప్పారు.

"అయినా అవి కథే కదత్తయ్యా... దానికి బాధపడడం ఎందుకు?"

"కథే అయినా మన జీవితాల నుంచి వచ్చిన కథలే కదా ఇవన్నీ. సహజంగా ఉంటాయి కాబట్టే అందరూ టీవీలకు అతుక్కుపోతున్నారు."

అక్కడికి దేశంలో అందరూ టీవీ చూడ్డం తప్ప వేరే ఏ పనీ చేయడం లేదన్న ధీమగా చెప్పారు.ఇక ఈవిడితో పెట్టుకుంటే లాభం లేద నుకుని వంట గదిలోకి అడుగుపెట్టి సింకులో నిండుగా ఉన్న గిన్నెలను చూసేసరికి నా తల గిర్రున తిరిగిపోయింది. చిందరవందరగా వున్న స్టవ్, దాని చుట్టూ నూనె మరకలతో అసహ్యంగా ఉంది. అలసిపోయి వచ్చిన నాకు ప్రాణం ఉసూరుమంది. అసలే పనిమనిషి కూడా రెండురోజుల నుండి రావడంలేదు. మా అత్తగారి మీద పీకలదాకా కోపం వచ్చింది.

"ఏం భయపడకమ్మాయ్...రేపు మంగ పనిలోకి వస్తానని కబురు చేసింది. ఈ పూట వంట నేను చేసేస్తాగా" అన్న మా అత్తగారి మాటలతో నాకోపం దిగిపోయింది. పాపం అని జాలిపడ్డాను కూడా.ఎప్పుడూ ఇదే వరుస. నా ఫీలింగ్స్ ఇట్టే పసిగట్టి నేను నోరు తెరవకముందే ఆవిడే సర్దేస్తారు. దాంతో మా మధ్య ఎలాంటి పొరపొచ్చాలుండవు. పైగా నాకు ఆవిడమీద బోలెడంత అభిమానం పెరుగుతుంది కూడా. ఇప్పుడూ అంతే.

"నేను చేసేస్తాలేగానీ... మీకు సీరియల్ ఏదో ఉన్నట్టుంది" అన్నాను.

అంతే..."అయ్యో...అయ్యో చూసావా మర్చిపోయాను" అంటూ ఒక్క గెంతులో హాల్లోకెళ్లారు. మా అత్తగారికి ఈ సీరియల్ అంటే పిచ్చి. అంతేకాదు, వంటల పిచ్చి కూడా ఉంది. నా కర్మకాకపోతే నాపై కక్ష కట్టినట్లుగా ఈ ఛానల్స్ వాళ్లంతా ఒకే టైమ్‌లో వంటలు చూపించడమేమిటో? ఈవిడ ఒక ఛానల్ చూస్తూ అందులో ప్రకటనలు రాగానే ఇంకో ఛానల్ మార్చి ఆ వంట కూడా చూసి అన్నీ బుర్రలోకి ఎక్కించేసుకుని వంట గదిలోకి వెళ్లి ఆ బుర్ర దులిపేసి అన్నీ కలిపేస్తే ఏముంది? కలగూరగంప... ఏ ఒక్కటీ రాదు. దాంతో సింకునిండా గిన్నెలు... నాకు చాకిరీ.అప్పటికీ రాసుకోండి అత్తయ్యా అంటాను. వింటేగా?

"ఆ... ఈ మాత్రం వంటలకు రాతకోతలెందుకు? ఇవన్నీ మా కాలంలో..." అంటూ మొదలెడతారు.

గదంతా సర్దేసి వంట మొదలెడుతూ కిచెన్ కౌంటర్‌లో నుండి హాల్లోకి చూసాను. ఎదురుగా మా అత్తగారి హావభావాలు నవ్వు తెప్పించాయి. సీరియల్‌లో ఏ విలనో వస్తే ఇక మెటికలు విరిచేస్తూ శాపనార్థాలు పెడుతూ వాళ్లను దులిపేస్తూ ఉంటారు. అదే ఏ ఫైటింగు సీనో వచ్చిందంటే ఇక్కడ ఈవిడా గాల్లో చేతులాడిస్తూ పిడికిలి బిగించి కొట్టేస్తూ (గాల్లోనే) ఫైటింగ్ చేసేస్తారు. ఆవిడ ఫీలింగ్స్ అన్నింటికీ ప్రక్కనున్న వాళ్లు తందానా... తానా అనాల్సిందే. లేకపోతే ఇంతే సంగతులు.ఎవ్వరైనా కొత్తవారు టీవీను గమనించకుండా ఆవిడ చేతులను మాత్రమే చూసారంటే మతి చలించిందేమో అని అనుకోడం ఖాయం. ఇంతలో లేచి చేతులు పైకెత్తి

తిరుగుతూ డాన్స్ చేస్తున్న ఆవిడను చూసి నవ్వాపుకోలేకపోయాను. రాత్రి పిల్లలు చదువుకు కూర్చున్నారంటే మాత్రం ఆవిడలోని ఈ చలాకీతనం నీరుగారిపోతుంది. ఆ టైములో నేను ఎట్టి పరిస్థితుల్లోనూ టీవీ పెట్టనివ్వను. అందుకే తన రూమ్‌లో ఇంకో టీవీ పెట్టించమని అస్తమానం పోరుతూ ఉంటారు. అలా చేస్తే ఈ పిచ్చి మరీ ముదిరిపోతుందేమోనన్న భయంతో నేనే వినీ విననట్లు ఊరుకుంటున్నాను.

ఇక కరెంట్ పోతే చూడాలి... ఏకంగా కథాకళే ఆడేస్తారు. ఫోన్ చేసి విజయవాడలో వున్న వాళ్లమ్మాయితో కథ చెప్పించుకునేదాకా ఆవిడ ప్రశాంతంగా ఉండలేరు. ఇక శని ఆదివారాలయితే సీరియల్ వేయనందుకు ఛానల్ వాళ్లను తెగ తిట్టేసుకుంటారు. అందుకే మా కాలనీలోని పిల్లలంతా ఆవిడ్ని 'సీరియల్ మామ్మ' అని పిలుస్తుంటారు.


★★★

ఉదయాన్నే "పెద్దమ్మగోరూ...పెద్దమ్మగోరూ" అంటూ మంగ దిగబడింది.

"ఏంటే రాగానే పెద్దమ్మగోరూ అంటున్నావు. పన్లోకొచ్చి రెండురోజులయింది. ఇప్పుడావిడతో కబుర్లు పెట్టుకుని కూర్చున్నావంటే చంపుతా. పోయి పని చూడు" కోపంగా కసిరాను.

"అదికాదమ్మా... పెద్దమ్మగోరికి టాంకు చెప్పాల" అంది.

"ఇప్పుడెందుకు ఆవిడకు?" వ్యంగ్యంగా అడిగాను.




"మా మామ మారిపోయాడమ్మా... ఇప్పుడు నన్ను ప్రేమగా సూసుకుంటున్నాడు. ఇదంతా పెద్దమ్మగోరి దయ" పళ్లన్నీ కనిపించేలా నవ్వుతూ చెప్పింది. ఇంతలో మా అత్తగారు రంగ ప్రవేశం చేసారు.

"ఏమే...రెండురోజులు ఎక్కడ తగలడ్డావే... కోడలెంత ఇబ్బంది పడిందో తెలుసా?" గయ్‌మన్నారు రాగానే.

"అనీమూన్ ఎల్లానమ్మగోరూ" సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ, రెండు చేతులతో ముఖం కప్పుకుంటూ అది చెప్పిన సమాధానానికి పిల్లలతో సహా అందరం ఫక్కున నవ్వేసరికి మరింత సిగ్గుతో పెరట్లోకి పారిపోయింది.

అస్తమానం తాగివచ్చి మంగను కొట్టి హింసించే రాములును పిలిచి మేమంతా ఎంత మందలించినా వినక పైగా అమ్మగోరికి చెబుతావా అంటూ మరో రెండు తగిలించేవాడు. దాంతో మేం చెప్పడం మానేసాము. ఇప్పుడు మా అత్తగారు ఏ మంత్రం వేసి వాడ్ని మార్చారో? అదే అడిగాను మా అత్తగార్ని.




## కరీనా ధైర్యం

పెళ్లి చేసుకోకుండానే సైఫ్ అలీఖాన్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ, కాబోయే శ్రీవారు ఈయనే అని ఎంతో పబ్లిగ్గా స్టేట్‌మెంట్లిచ్చే కరీనా- తమలాంటి సినీతారల గురించి జనాల్లో వచ్చే కామెంట్లు తనకీ తెలుసంటుంది. 'మా గురించి మరీ ఓవర్‌గా మాట్లాడుకుంటుంటారు. కానీ మేం మా టాలెంట్‌ని ప్రదర్శించి స్టార్‌లమై సంపాదించుకుంటున్నాం. అందరూ వ్యాఖ్యానించేట్టు నీచమైన పనులు మేం చేయం' అంటూ తనదైన ధీమాని వ్యక్తం చేసింది. ఏది ఏమైనా అంత డాషింగ్‌గా మాట్లాడే కరీనాని మనం మెచ్చుకోవాల్సిందే.




"ఏం లేదమ్మాయ్... యాహూ ఛానలుందా?"

ఇంకో పరీక్ష నాకు. "ఆ ఉంది" అనేసాను తెలియకపోయినా.

"వాడిని కూర్చోబెట్టి అందులో వచ్చే ఆలుమగలు సీరియల్ చూపించాను. దెబ్బతో మారిపోయినట్టున్నాడు సన్నాసి. వాడిలాగే అందులోనూ భార్యను హింసించే భర్తే. ఆ బాధలు పడలేక పాపం ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటుంది. పిల్లలు అనాధలుగా వీధిలో అడుక్కుంటూ ఉంటారు. వీడికి పిల్లలంటే ప్రాణంకదా. అందుకే 'ఒరే మంగనూ, పిల్లలనూ వీళ్లలో చూసుకోరా' అని ఒకసారి అన్నా. వాడు బెంబేలెత్తిపోయినట్టున్నాడు. చూద్దాం ఈ మార్పు ఎన్నాళ్లో?" అంటూ పూజ గదిలోకి వెళ్లిపోయారు. మా అత్తగారికి భక్తి కూడా ఎక్కువే. ఉదయాన్నే పూజ చేయందే పచ్చి మంచినీళ్లు కూడా ముట్టరు. రోజూ గుడికెళ్లి పారాయణం చేసుకుని ప్రసాదం తెచ్చి అందరికీ పంచడం ఆవిడ ముఖ్యమైన దినచర్య.

పెరట్లో "హనీమూన్‌కు ఎక్కడికెళ్లారు మంగా" అని అడుగుతున్న పన్నెండేళ్ల మా పాపతో-

"అట్టాంటివి నీవడక్కూడదు పాపా" అని అంటున్న దాని కళ్లల్లో కొత్త కాంతి, ముఖంలో సంతోషం, పెదవులపై నవ్వుకు కారణం మా అత్తగారు అయినందుకు గర్వంగా ఫీలయ్యాను.

***

"నేనన్నీ చూసుకుంటా. ఓ పదిరోజులుండి రా" అని చెప్పిన మా అత్తగారికి అన్నీ అప్పగించి నాన్నగారి సంవత్సరీకానికి అమ్మ దగ్గరకొచ్చాను. అమ్మ ఇష్టప్రకారం అన్నీ సక్రమంగా జరిపించాడు అన్నయ్య. అమ్మను చూస్తుంటే చాలా బాధగా ఉంది నాకు. బాగా చిక్కిపోయింది. ఆమెలో నిస్తేజం, నిర్లిప్తత, దిగులు స్పష్టంగా కనిపిస్తోంది. మాటలు కూడా బాగా తగ్గించి ఎప్పుడూ ఆధ్యాత్మిక పుస్తకాలు చదువుతూ కూర్చుంటుంది. అన్నయ్య, వదిన ఆఫీసుకు, పిల్లలు స్కూలుకు వెళ్లాక ఇల్లంతా నిశ్శబ్దం. అమ్మ ఒంటరిగా కూర్చుని ఆ పుస్తకాలు చదువుతూ వైరాగ్యం పెంచుకుంటోందని అనిపిస్తోంది. నాకు మా అత్తగారు గుర్తుకొచ్చారు. ఒకవైపు పూజ పునస్కారాలు, పారాయణాలంటూ ఆధ్యాత్మికతత్వాన్ని పాటిస్తూనే ఇటు టీవీ సీరియల్స్, వంటలు మాటలు అంటూ లౌకికతత్వాన్ని కూడా మరువక నిరాశ నిస్పృహ, ఒంటరితనాలను దగ్గరకు రానివ్వక తన వయసును మరచిపోయి నవ్వుతూ తుళ్లుతూ ఉండే ఆవిడకు హాట్సాఫ్ చెప్పక తప్పదు.

"ఆధ్యాత్మికత మనకు ఆత్మస్థైర్యాన్ని, ఆత్మానందాన్ని, మనోబలాన్ని, ప్రశాంతతను ఇస్తుందనడంలో సందేహంలేదు. ఇంకోవైపు వైరాగ్యాన్ని కూడా కలిగిస్తుంది. కానీ లౌకిక బంధాలలో చిక్కుకున్న మనలాంటి సగటు మనుష్యులకు మానసికంగా తాత్కాలిక ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని ఇచ్చే ఇలాంటి వ్యాపకాలు కూడా కావాలి. లేకపోతే బతుకు భారమయిపోతుంది" అంటుంటారు మా అత్తగారు. ఇప్పుడు అమ్మను చూస్తుంటే ఆవిడ మాటలు ఎంత కరెక్టో అర్థమవుతోంది. అమ్మ తన బ్రతుకు భారంగా అనుకుంటోందేమోనన్న ఫీలింగ్ నా గుండెను పిండేసింది.

పదిరోజులు ఉందామని వచ్చిన నేను నాలుగురోజులకే తిరుగు ప్రయాణమయ్యాను అమ్మతోసహా.ఇల్లు చేరగానే మొట్టమొదటగా నేను చేసిన పని మా అత్తగారి రూములో టీవీ పెట్టించడం. దాంతో ఆవిడ ముఖం చాటంత అయింది. మా పిల్లలకన్నా ఎక్కువగా అల్లరిచేసే మా అత్తగారి సహవాసంతో నెలరోజుల్లో అమ్మ వైరాగ్యం తగ్గుముఖం పట్టింది.

మునుపటిలా నవ్వుతూ తిరుగుతున్న అమ్మను చూసాక మా అత్తగారు నా కళ్లకు దేవతలా కనిపించారు.

★